సాక్షి
జగిత్యాల
శుక్రవారం ၊ 3 ၊ మార్చి ၊ 2023



రెండోరోజు పవిత్రోత్సవాలు

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో రెండోరోజు పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి హోమం నిర్వహించారు.



అంజన్నకు రూ.కోటి ఆదాయం

కొండగట్టు: అంజన్న హుండీని లెక్కించారు. 63 రోజులకు గాను రూ.1,01,73,995 ఆదాయం వచ్చింది. 92గ్రాముల బంగారం, 3.700కిలో గ్రాముల వెండి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
35.0/18.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఎండ తీవ్రత, ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట చలితీవ్రత ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

డాక్‌ఘర్ నిధియత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జగిత్యాల: విదేశీ ఎగుమతుల కోసం ప్రత్యేక డాక్‌ఘర్ నిధియత్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఇప్పటికే వివిధ సేవలను విస్తృతపరిచిన భారత తపాలాశాఖ తాజాగా విదేశాలకు పార్శిల్స్ సౌకర్యాన్ని ప్రవేశపెట్టిందన్నారు. డాక్‌ఘర్ నిధియత్ కేంద్రం ద్వారా తినుబండారాలు, మందులు, గిఫ్ట్ ఆర్టికల్స్ ఎగుమతి చేయవచ్చని అన్నారు. ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ లైసెన్ కస్టమర్ కోడ్ కలిగిన సంస్థలు ఈ కేంద్రం ద్వారా విదేశాలకు సులభంగా ఎగుమతి చేసుకోవచ్చన్నారు. ఫ్రీ హోం పికప్‌తో పాటు అతితక్కువ ధరలో పార్శిల్ ప్యాకేజింగ్ యూనిట్ ద్వారా ప్యాక్ చేయడం జరుగుతుందన్నారు. ఇది కరీంనగర్ హెడ్ పోస్టాఫీసు కేంద్రం పరిధిలో ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.


పొగాకు ప్రమాదకరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

జగిత్యాల: ప్రజారోగ్యానికి పొగాకు అత్యంత ప్రమాదకరమైనదని డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో పొగాకు సంబంధిత ఉత్పత్తుల జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పొగాకు వాడటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ముఖ్యంగా గుండె సంబంధిత, శ్వాసకోశ వ్యాధులు, కేన్సర్‌తో సహా అనేక వ్యాధులు వస్తాయని, పొగాకు వాడకూడదన్నారు. కోప్టా చట్టం సెక్షన్ 4ఏ ప్రకారం బహిరంగ ప్రదేశాలలో పొగతాగుట నేరమని తెలిపారు. పోలీసు, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, లేబర్ ఆఫీసర్, ఎంపీడీవో, శానిటరీ ఇన్‌స్పెక్టర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సమన్వయంతో పనిచేసి ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అన్ని విద్యాసంస్థల్లో పొగాకు ఫ్రీజోన్‌గా ప్రకటించడం జరిగిందని, ఎవరైనా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోప్టా చట్టం ప్రోగ్రాం అధి కారి డాక్టర్ శ్రావణ్, అసంక్రమిత వ్యాధు ల ని యంత్రణ అధికారి సమియోద్దీన్, డాక్టర్ శ్రీని వాస్, జైపాల్‌రెడ్డి, డీఎస్పీ రవి, ఫుడ్ సేఫ్టీ ఆఫీ సర్ అనూష, లేబర్ ఆఫీసర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన జిల్లా పర్యవేక్షక బృందం



విద్యార్థులతో బోర్డుపై రాయిస్తున్న అధికారి

రాయికల్: రాయికల్ మండలం ఆలూరు, ఇటిక్యాల గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో గురువారం జిల్లా పర్యవేక్షక బృందం సభ్యులు సందర్శించారు. తొలిమెట్టు కార్యక్రమం అమలు, కనీస సామర్థ్యాల సాధన, పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు అభయ్‌రాజ్, పరమేశ్వర్, శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు ముక్కెర శేఖర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

నైతికత పర్యావరణ విద్యాపరీక్షలు

జగిత్యాల: జిల్లాలోని అన్ని ఇంటర్మీడియట్ కళాశాలల్లో శనివారం నైతికత మానవీయ విలువలు, విద్యా పరీక్షలు, సోమవారం రోజున పర్యావరణ విద్యాపరీక్షలు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రెండు పరీక్షలు వారు చదువుతున్న కళాశాలల్లోనే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల మధ్య ఉంటాయని, ఇంటర్‌లో ఉత్తీర్ణత పొందాలంటే ఈ పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా సెకెండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు పై పరీక్షలు ఉత్తీర్ణులు కాని వారు కూడా హాజరు కావాల్సి ఉంటుందన్నారు. హాల్‌టికెట్లను కళాశాల ప్రిన్సిపల్స్ నుంచి తీసుకోవాలని, ప్రతి విద్యార్థి వ్యక్తిగత, గ్రూపు ప్రాజెక్ట్‌లను తప్పనిసరిగా కళాశాలలో సబ్మిట్ చేయాలని సూచించారు.

ర్యాంబో ది గ్రేట్

- కొండగట్టు చోరీ కేసు ఛేదనలో పోలీసు జాగిలం పాత్ర
- పోలీసులకు కీలక సమాచారం చూపిన ర్యాంబో డాగ్
- ఆ దిశగానే విచారణ.. ర్యాంబోను అభినందించిన ఎస్పీ భాస్కర్

జగిత్యాలజోన్: ఇటీవల సంచలనం సృష్టించిన జిల్లాలోని ప్రముఖ కొండగట్టు ఆలయంలో చోరీ కేసును ఛేదించడంలో పోలీసు జాగిలం 'ర్యాంబో' కీలకంగా వ్యవహరించింది. ఫిబ్రవరి 23 అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరగ్గా.. మరునాడు ఉదయమే పోలీసులు ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సాక్ష్యాలు చెరిగిపోకుండా, భక్తులను లోనికి అనుమతించకుండా ఆలయ ద్వారాలు మూసివేశారు. ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పోలీసు జాగిలం ర్యాంబోను రంగంలోకి దించారు. ర్యాంబో ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో కలియ తిరుగుతూ, దొంగలు ఎక్కడి నుంచి వచ్చారు..? చోరీ తరువాత ఎక్కడి నుంచి వెళ్లారు... ఆలయంలో ఏఏ ప్రదేశాల్లో తిరిగారు.. ఎక్కడ కూర్చుకున్నారు.. ఎక్కడ పడుకున్నారు.. అనే ఆధారాలతో పాటు ఆలయంలో ఎక్కడెక్కడి వస్తువులు ఎత్తుకెళ్లారు అనే విషయాల్లో ర్యాంబో జిల్లా పోలీసులకు కీలక సమాచారం అందించింది. పోలీసులకు దొరికిన కొన్ని ఆధారాలను ర్యాంబో ముందు ఉంచగా దొంగల కదలికలపై అవగాహన వచ్చేలా చేసింది. కొండగట్టు చోరీ కేసును ఛేదించిన పోలీసులు ఈనెల 1న ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ క్రమంలో నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ర్యాంబోను ఎస్పీ భాస్కర్ ప్రత్యేకంగా అభినందించారు.



ర్యాంబోను అభినందిస్తున్న ఎస్పీ భాస్కర్

చోరీ జరిగిందంటే.. ర్యాంబో రంగ ప్రవేశమే..

జిల్లాలో చోరీలు, అనుమానిత హత్యలు జరిగిన సందర్భంలో ఎస్పీ ఆదేశాల మేరకు ర్యాంబో రంగప్రవేశం చేసి కీలక సమాచారం అందిస్తుంది. భారీ బహిరంగసభలు, మంత్రుల సమావేశాలు జరిగినప్పుడు ర్యాంబో తనిఖీ చేసిన తరువాత అనుమతి ఇస్తారు. ర్యాంబోకు ఎక్కడైనా అనుమానం వచ్చిందంటే పోలీసులు వెంటనే ప్రమత్తమై క్షుణ్ణంగా పరిశీలిస్తారు. విధుల్లో ఉన్నప్పుడు పోలీసుల మాదిరిగానే ఖాకీడ్రెస్‌లో కనిపిస్తుంది. మిగితా సమయంలో హ్యాండ్లర్లతో జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఉంటుంది.

రాష్ట్రస్థాయిలో ప్రత్యేక శిక్షణ

పోలీసు జాగిలాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. జాగిలం, ఇద్దరు హ్యాండర్లకు దాదాపు రూ.4లక్షల నుంచి రూ.5లక్షలు ఖర్చు చేస్తుంది. పోలీసు జాగిలం 14ఏళ్ల వరకు జీవిస్తుంది. తొమ్మిది ఏళ్లకే రిటైర్మెంట్ ఇస్తారు. ఆ తరువాత కూడా పోలీసుల పర్యవేక్షణలోనే ఉంటుంది. అనారోగ్యంతో మరణిస్తే లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తారు. వీటికి సైతం డ్యూటీ మీట్‌లు, బంగారు, రజక, కాంస్య పతకాలు అందిస్తారు. హోంఫుడ్, ప్యాకెట్‌ఫుడ్, మిశ్రమ ఆహారాన్ని అందిస్తారు.

ర్యాంబో ప్రత్యేకత ఇదే..

- లాబ్రాడార్ జాతికి చెందిన ర్యాంబో 4నెలల వయసులోనే పోలీసుశాఖలో చేరింది. హ్యాండ్లర్ల పర్యవేక్షణలో ఎనిమిది నెలలపాటు హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొందింది. బాంబును పసిగట్టడం, మాదకద్రవ్యాలను గుర్తించడం, దొంగతనాలకు పాల్పడిన నేరస్తులను పట్టుకోవడం వంటి అంశాల్లో శిక్షణ తీసుకుంది. శిక్షణలో భాగంగా మాక్‌డ్రిల్ నిర్వహించగా.. ర్యాంబో ఉత్తమ పోలీసుడాగ్‌గా నిలిచింది. శిక్షణ అనంతరం ర్యాంబోను ఉమ్మడి జిల్లాకు కేటాయించగా.. జిల్లాల విభజన తరువాత జగిత్యాలకు పంపించారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో హ్యాండ్లర్ ర్యాంబోకు అవసరమైన ఆహారం, శిక్షణ ఇస్తుంటాడు. పోలీసు కన్నా ర్యాంబోకు పసిగట్టే శక్తి 100 రేట్లు ఎక్కువగా ఉంటుంది.



హ్యాండ్లర్‌తో పోలీసు డాగ్ 'ర్యాంబో'

మా ర్యాంబోతోనే కీలక సమాచారం



కొండగట్టు దొంగతనం విషయంలో ర్యాంబో టీంతో మాకు కీలక సమాచారం దొరికింది. ఆ దిశగానే ప్రయత్నించడంతో దొంగల గురించి మరింత సమాచారం లభించింది. మా పోలీసు బృందాలు అవసరమైనప్పుడల్లా ర్యాంబో సేవలు వినియోగించుకుంటునే ఉంటాం. ర్యాంబో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండి విధుల్లో ర్యాంబో ది గ్రేట్ అనిపించుకుంటుంది.

– భాస్కర్, ఎస్పీ, జగిత్యాల

బ్రహ్మోత్సవాలకు వేళాయే..



ధర్మపురిలో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన నృసింహుడి ఆలయం

- నేటినుంచి ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాలు
- పుట్ట బంగారంతో ప్రారంభం.. గోదావరి వద్ద కనిపించని ఏర్పాట్లు



ధర్మపురి: నృసింహుడి బ్రహ్మోత్సవాలకు ధర్మపురి ముస్తాబైంది. నేటినుంచి 13 రోజుల పాటు అత్యంతవైభవంగా సాగే వేడుకకు అంతా సిద్ధమైంది. జిల్లాలోని ధర్మపురి లక్ష్మీనృసింహుడి ఆలయంలో ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి వేడుకలో పాల్గొంటారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆలయానికి రంగులు, విద్యుత్‌దీపాలు, చలువ పందిళ్లతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించారు. గోదావరి ఒడ్డున చలువపందిళ్లు, స్త్రీలు బట్టలు మార్చుకొనేందుకు షెడ్లు, పారిశుధ్యం, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. గోదావరిలో గతేడాది కన్నా ఈసారి నీటిమట్టం ఎక్కువగా ఉండడంతో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇరిగేషన్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనుల్లో చలనం లేదు.

13 రోజుల పాటు ఉత్సవాలు

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నేటి నుంచి 15వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిపిస్తారు. 30వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వస్తారని అధికారుల అంచనా వేశారు. నేడు పుట్టబంగారం తీసుకురావడంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 4న సాయంత్రం స్వామివార్ల కల్యాణం ఉంటుంది. 7,8,9 తేదీల్లో బ్రహ్మపుష్కరిణిలో తెప్పోత్సవం, డోలోత్సవం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే వేలాది మంది భక్తులకు తాగునీరు, భోజనవసతులతో పాటు స్త్రీలకు వసతులు ఏర్పాటుచేయాల్సి ఉంది. బస్టాండు, మున్సిపల్ కార్యాలయం, దేవస్థానం, గోదావరి తీరంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఓల్డ్ టీటీడీ కల్యా మండపం, బ్రాహ్మణసేవా సంఘంలో అన్నదానం ఉంటుంది. బస్టాండు, దేవస్థానం, ఎస్‌ఎల్‌ఎన్ డిగ్రీ కళాశాల, మంగలిగడ్డ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు అందుబాటులో ఉంటాయి. వివిధ ప్రాంతాల నుంచి 200 బస్సులు బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ నడిపించనుంది. జగిత్యాల డిపో నుంచి 26, నిర్మల్ నుంచి 15, ఆర్మూర్ డిపో నుంచి 100, కరీంనగర్ నుంచి 10, మంచిర్యాల, ఆసిఫాబాద్ నుంచి 50బస్సులు నడిపించనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

ధర్మపురి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశాం. నీడ, నీటి వసతులతో పాటు భోజన వసతులను కల్పిస్తున్నాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. నేటి ఈనెల 15 వరకు మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్సవాలు మహా వైభవంగా జరిపిస్తాం. – శ్రీనివాస్, దేవస్థానం ఈవో

సిలిండర్ భారం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి

- అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: పెరిగిన వంటగ్యాస్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనకు తాముసైతం కలిసి వస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రూ.450కి లభించిన సిలిండర్ ప్రస్తుతం రూ.1155కి చేరిందని ఇదేనా మోదీ సుపరిపాలన అని ప్రశ్నించారు. అదేవిధంగా జిల్లాకేంద్రంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం జరుగుతోందని, అర్హత ప్రాతిపదికన ఇళ్ల కేటాయింపు జరపాలని డిమాండ్ చేశారు. దాదాపు 500 మంది పాత లబ్ధిదారుల ఇండ్ల బేస్‌మెట్లు కూల్చిన ప్రభుత్వం కొత్తగా నిర్మించే డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అవకాశం కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు నడుచుకోవాలని సూచించారు. శుక్రవారం జగిత్యాల జిల్లాకేంద్రంలోని వాణినగర్ నటరాజ్ చౌరస్తా నుంచి హాథ్ సేహాథ్ జోడో యాత్ర ప్రారంభించబోతున్నామని వివరించారు. రెండురోజుల పాటు సాగే యాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

అంగన్‌వాడీల పాత్ర కీలకం

భావితరాలను తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని, అలాంటి అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రతతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల దీక్షకు జీవన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేర్చడంతో పాటు పిల్లలు, గర్భిణులు, బాలింతల సంరక్షణలో అంగన్వాడీలు కీలక బాధ్యత నిర్వహిస్తున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని 9 విద్యుత్ సర్కిళ్ల పరిధిలో గురువారం విద్యుత్‌ప్రమాదాలపై విద్యుత్ అధికారులు అవగాహన కల్పించారు. జగిత్యాల, ధర్మపురి, మల్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు. అక్కడక్కడ విద్యుత్ సిబ్బంది కూడా మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో డీఈ, ఏడీ, ఏఈలు పాల్గొన్నారు.

నేడు ధ్రువీకరణపత్రాల స్వీకరణ

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులు తమ ధ్రువీకరణ పత్రాలు శుక్రవారం నటరాజ్ థియేటర్ పక్కన గల ఆర్‌కేడీజీ స్కూల్‌లో తమ వార్డు అధికారి, వార్డు ఆర్పీకి అందజేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల పరిధిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పొందేందుకు ఆధార్ కార్డు జిరాక్స్ కుటుంబ సభ్యులందరివి, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్, రేషన్‌కార్డు జిరాక్స్, కులధ్రువీకరణ జిరాక్స్, ఆదాయ ధ్రువీకరణ జిరాక్స్, బ్యాంక్ పాస్‌బుక్ (తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మినహా) పాస్‌పోర్టు సైజు ఫొటోలను అందజేయాలని సూచించారు. ఒకవేళ ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేని వారు మీసేవలో దరఖాస్తు చేసుకుని, వాటి మీసేవ జిరాక్స్‌లను వార్డు అధికారికి ఇవ్వవచ్చన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువీకరణపత్రాలు స్వీకరిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

పేదల కడుపు కొట్టడమే బీజేపీ నైజం



సిలిండర్ ఎత్తి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల: బీజేపీ కేంద్ర ప్రభుత్వం పేదప్రజలను దోచి, పెద్దలకు పంచుతుందని, అదానీ, అంబానీలకు ప్రజల డబ్బును పంచేందుకు సిలిండర్ ధరలు పెంచుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ గురువారం కొడిమ్యాల మండలం పూడూరు చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2014లో రూ.400 ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,155 పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజల నెత్తిన గుదిబండ మోపిందన్నారు. సిలిండర్ ధరలు పెంచడానికి కారణమేంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు స్మృతిఇరానీ, నిర్మలా సీతారామన్ గ్యాస్ ధరల పెంపుపై స్పందించాలన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్, ఎంపీపీ మేనేని స్వర్ణలత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్లు మేనేని రాజనర్సింగారావు, బండ రవీందర్‌రెడ్డి, పోలు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పాలు.. ఆగని పక్కదారి

- ప్యాకెట్లను అమ్ముకుంటున్న పలువురు అంగన్‌వాడీ సిబ్బంది
- గత డిసెంబర్‌లో వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'
- దృష్టి సారించని సంబంధిత అధికారులు
- అడ్డుకట్ట వేయకపోవడంపై సర్వత్రా విమర్శలు



- ఈ పాల ప్యాకెట్లు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. గర్భిణులు, బాలింతల కోసం వీటిని అందిస్తోంది. మెట్‌పల్లి పరిధిలోని కొన్నిచోట్ల సిబ్బంది ప్యాకెట్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గుట్టుగా సాగుతున్న ఈ దందాను గత డిసెంబర్‌లో 'సాక్షి' వెలుగులోకి తీసుకవచ్చింది. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి ఉంటే ఈ అక్రమానికి అడ్డుకట్ట పడే అవకాశముండేది. కానీ వారు పట్టించుకోకపోవడంతో ఇప్పటికీ దర్జాగా మార్కెట్‌లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటూనే ఉన్నారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల, కథలాపూర్ మండలాలు ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో మొత్తం 312 కేంద్రాలున్నాయి. ఒక్కోకేంద్రంలో గర్భిణులు, బాలింతల సంఖ్యను బట్టి ప్రభుత్వం పాల ప్యాకెట్లను సరఫరా చేస్తోంది. అయితే వీటిని కొన్ని చోట్ల సిబ్బంది లబ్ధిదారులకు ఇవ్వకుండా బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు.

స్వీట్లు, పూజా దుకాణాలకు అమ్మకం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన పాల ప్యాకెట్లను కొందరు సిబ్బంది స్వీట్లు, పూజా దుకాణాలకు తరలిస్తున్నారు. పాల ధర ఎక్కువగా ఉండడంతో స్వీట్లు దుకాణాల నిర్వాహకులు తక్కువ ధరకు దొరుకుతున్న అంగన్‌వాడీ ప్యాకెట్లను తీసుకుంటున్నారు. అలాగే ప్రత్యేకంగా అభిషేకాల కోసం కూడా పూజా దుకాణ నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు. మెట్‌పల్లి పట్టణంలో పేరొందిన ఓ పూజా దుకాణంలో పెద్దసంఖ్యలో వీటిని విక్రయిస్తున్నారు. సదరు వ్యాపారి పాల కోసం వచ్చే కస్టమర్లకు ఈ ప్యాకెట్లను అంటగడుతున్నారు. వీటి అమ్మకంతో ఎక్కువలా భం వస్తుండడంతో వ్యాపారులు అంగన్‌వాడీ సిబ్బంది నుంచి ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు.

అధికారుల తీరుపై విమర్శలు

పాల ప్యాకెట్లు బహిరంగ మార్కెట్‌కు తరలిస్తున్న వ్యవహారం 'సాక్షి' వెలుగులోకి వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు ఉదాసీనత చూపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ బాగోతంపై గతంలో ఓ వ్యక్తి డివిజన్ అధికారికి ఫిర్యాదు చేశాడు. కానీ ఆ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కేంద్రాలపై నిఘా ఉంచడం, తరుచుగా తనిఖీలు చేయడం వంటి చర్యలు అధికారులు చేపడితే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందే అవకాశముంటుంది. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం చూపడాన్ని ఆసరాగా చేసుకొని కొందరు సిబ్బంది సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సిబ్బందికి మెమోలు ఇచ్చాం

పాల ప్యాకెట్లను విక్రయిస్తున్న దానిపై గతంలో కేంద్రాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మందలించాం. అంతేగాకుండా మెమోలు ఇచ్చాం. ప్యాకెట్లను పక్కదారి పట్టించడం సమంజసం కాదు. వ్యాపారులు వీటిని తీసుకోవద్దు. ఖచ్చితమైన సమాచారమందిస్తే టీచర్లతో పాటు వ్యాపారులపైన చర్యలు తీసుకుంటాం.

– తిరుమలాదేవి, సీడీపీఓ

క్లుప్తంగా

అదనపు బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

- ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప


మాట్లాడుతున్న వెంకటనర్సప్ప

జగిత్యాల: ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు అదనపు బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు జగిత్యాల ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల నుంచి ధర్మపురికి 22 బస్సులతో పాటు బ్రహ్మోత్సవాల సందర్భంగా మరో 10 బస్సులు నడుపుతున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల : కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శ్రీ చైతన్య కళాశాల దిష్టిబొమ్మను గురువారం ఏబీవీపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. సాత్విక్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కార్యవర్గ సభ్యుడు అంజి, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్


కొనుగోలు చేస్తున్న మహిళలు

జగిత్యాల : జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్న కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్‌లో పలు రాష్ట్రాలకు చెందిన ప్రఖ్యాతి గాంచిన కళాకారులతో తయారు చేసిన వస్తువులు, గృహోపకరణాలు, చేనేత కళాకారులతో చేయబడిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

గుడిసె దగ్ధం


దగ్ధమైన నిత్యావసర వస్తువులు

రాయికల్: మండలంలోని ఆల్యానాయక్ తండా.. బానోతు గోపాల్‌కు చెందిన గుడిసె దగ్ధమైంది. గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో స్థానికులు గమనించి మంటలనార్పేశారు. ఈ ప్రమాదంలో నిత్యావసర వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నందునాయక్ కోరారు.

గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై నేడు ధర్నా

జగిత్యాల: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపుపై నిరసనగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. తహసీల్ చౌరస్తాలో ఉదయం 10 గంటలకు చేపట్టే నిరసన, ధర్నాకు ప్రజాప్రతినిధులు, మండలప్రజలు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

జోరుగా వడ్డీ వ్యాపారం

- అందినంత దోచుకుంటున్న వ్యాపారులు
- దాడులు చేస్తున్నా గుట్టుగా దందా



జగిత్యాల: ప్రజల అవసరాలు..చిరు వ్యాపారాల కోసం డబ్బు అవసరం ఉన్నవారిని ఆసరాగా చేసుకుని జిల్లాలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు అందినంత దోచుకుంటున్నారు. వివిధ అవసరాల కోసం బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలంటే కొన్ని నిబంధనలు, ఆధారాలు లేని పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు, వ్యాపారులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. చిరువ్యాపారం చేసుకునే వారికి బ్యాంకుల నుంచి రుణాలు అందకపోవడంతో ఫైనాన్స్ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. జిల్లాలో సుమారు వెయ్యిమందికి పైగా వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. డెయిలీ ఫైనాన్స్, సీడీలు, సీఎం, ఆటో ఫైనాన్స్ లాంటి వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కొన్ని ఫైనాన్స్‌లు డబ్బులు అందజేసే ముందే కొంత తీసుకోవడంతో పాటు అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇటీవల జిల్లాస్థాయిలో దాడులు నిర్వహించారు. వారి వద్ద ఎలాంటి తేదీ, పేరులేకుండా ఉన్న ప్రామిసరీ నోట్లతో పాటు నగదును స్వాధీనం చేసుకోవడంతో కలెక్టర్ వారికి జరిమానాలు విధించారు. అయినా వడ్డీ వ్యాపారం ఆగడం లేదు.

చిరువ్యాపారులు, నిరక్షరాస్యులే టార్గెట్

చిరు వ్యాపారులు, నిరక్షరాస్యులను ఆసరాగా చేసుకుని కొందరుముందుగానే డబ్బులను కటింగ్ పేరిట అత్యధికంగా వడ్డీలు వసూలు చేస్తున్నారు. రూ.10 వేల అప్పు తీసుకుంటే అందులో రూ.1200 కట్‌చేసి రూ.8800 మాత్రమే ఇస్తుంటారు. సీడీ రకం రుణం తీసుకుంటే ఒక లక్షకు రూ.200 చొప్పున వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. రూ.10 వేలు తీసుకుంటే వారానికి వెయ్యి చొప్పున 12 వారాలు చెల్లించాలి. దీని వల్ల రూ.6 నుంచి రూ.7 వేల వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రైవేటు వడ్డీ వ్యాపారులు ఎక్కువ మొత్తంలో వడ్డీ వసూలు చేయడంతో కొన్ని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఫైనాన్స్‌లు నిర్వహించాలంటే రిజర్వ్ బ్యాంక్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాగా ప్రైవేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహిస్తుండగా ఉన్నతాధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

మధ్యవర్తుల కమిషన్

నేరుగా వడ్డీ వ్యాపారస్తుల వద్దకు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు వెళ్లినా డబ్బులు ఇవ్వడం లేదు. ఇందులో మధ్యవర్తి ఉంటేనే ఫైనాన్స్ ఇస్తారు. కాగా కమిషన్ కింద వారికి 2 శాతం ఇవ్వాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అద్దాగా షాపులు

ఫైనాన్స్‌లను ఏర్పాటు చేయాలంటే లైసెన్స్‌లు అవసరం ఉండడంతో కొందరు వ్యాపారులు అద్దాల కోసం చిన్నచిన్న గదులను ఏర్పాటు చేసి దుకాణాలు, కోచింగ్ సెంటర్లు, అకాడమీ సెంటర్లు అంటూ బ్యానర్లు పెట్టి లోపల మాత్రం ఫైనాన్స్‌లు నిర్వహిస్తున్నారు. విద్యానగర్, కృష్ణానగర్, పురాణిపేట, ఉప్పరిపేట, గాంధీనగర్, కస్తూరి స్ట్రీట్, టవర్‌సర్కిల్, బైపాస్‌రోడ్డు సమీపంలో ఎంతోమంది ఈ దందాను నడుపుతున్నారు. ఒక్కొక్కరికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వడ్డీలకు ఇస్తున్నారు.

పెరిగిన కరువు భత్యాన్ని విడుదల చేయాలి

- కరువు భత్యాన్ని విడుదల చేయాలి
- బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు


సమావేశంలో మాట్లాడుతున్న సుతారి రాములు

కోరుట్ల : బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యాన్ని ఏప్రిల్ నెలనుంచి విడుదల చేయాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు బీడీ పరిశ్రమ యాజమాన్యాలను కోరారు. గురువారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 8 లక్షల మంది బీడీ కార్మికులు, ప్యాకర్లకు, నెలసరి ఉద్యోగులకు 2022 జనవరి నుంచి డిసెంబర్ వరకు పెరిగిన భత్యాన్ని చెల్లించాలన్నారు. నెలసరి ఉద్యోగులకు ఏప్రిల్ 1నుంచి అములు చేయాలన్నారు. కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సామల మల్లేశం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్, కొక్కుల శాంత, కార్యదర్శులు ఎండీ ముక్రం, ఓమయ్య, అంకం అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టిసారించాలి

- బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి


యువకులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న గోపాల్‌రెడ్డి, నాయకులు

కథలాపూర్: యువత క్రీడలపై దృష్టిసారించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని భూషణరావుపేటలో యువకులకు క్రీడాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎద్మల వినోద్ రెడ్డి, తుమ్మనపెల్లి మహేశ్, ఆరెల్లి సాయి, ప్రణీత్ గౌడ్, యువకులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- కోరుట్ల ఏడీఏ దండ రమేశ్


మాట్లాడుతున్న ఏడీఏ దండ రమేశ్

మల్లాపూర్ : పంటలకు చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుట్ల ఏడీఏ దండ రమేశ్ సూచించారు. గురువారం మండలంలోని ముత్యంపేట రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు మోతాదుకు మించకుండా ఎరువులను చల్లాలన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, పూత, గింజ గట్టిపడే దశలో ఆశించడంతో పంటలను నష్టపరుస్తాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈవో సంధ్య, ప్యాక్స్ చైర్మన్ తక్కళ్ల నరేశ్ రెడ్డి, రైతులు వాకిటి భూమారెడ్డి, వంగ పోతయ్య, నిమ్మల విజయ్, వాకిటి తిరుపతి, రాజేశ్వర్ రెడ్డి, బొల్లం పవన్ కల్యాణ్, నాగేష్, శంకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలి


మాట్లాడుతున్న కొంగర పవన్‌బాబు

మల్లాపూర్ : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగర పవన్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ముందుండాలన్నారు. ఇందుకు ప్రతిమండల కేంద్రంలో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గజ్జెల కాంతం, రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్, నాయకులు గజ్జెల రాజు, బంగారు దీపక్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, మగ్గిడి రాజేశ్వర్, సుద్దాల నాగరాజు, అరిగడ్డి పెద్దులు, కోరుట్ల నరేశ్, బాపురపు రాకేష్, ఉయ్యాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకుకు ఫోరం జరిమానా

జగిత్యాల జోన్ : పట్టణంలోని యూనియన్ బ్యాంకుకు జిల్లా వినియోగదారుల ఫోరం జరిమానా విధించడమే కాకుండా ఖాతాదారుడికి రూ.2.28 లక్షలను 9 శాతం వడ్డీతో చెల్లించాలని జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్ స్వరూపరాణి, సభ్యులు శ్రీలత, నర్సింహారావు గురువారం తీర్పు చెప్పారు. ఫోరం న్యాయవాది మెట్ట మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సిద్ధం రాజశేఖర్ యూనియన్ బ్యాంకులో 2014లో సాయిదుర్గ వైన్స్ పేరిట బ్యాంకు ఖాతా తెరిచాడు. ఈ ఖాతా లావాదేవీలు నిర్వహించేందుకు తిరుపతి గౌడ్ అనే వ్యక్తికి బ్యాంకు ద్వారా అనుమతి ఇచ్చాడు. వైన్స్‌పేరిట లావాదేవీలు ముగియగా తిరుపతి గౌడ్‌కు ఎలాంటి బ్యాంకు లావాదేవీలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వొద్దంటూ బ్యాంకు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. అధికారుల సూచన మేరకు అఫిడవిట్ సైతం దాఖలు చేశాడు. ఈ నేపథ్యంలోనే రాజశేఖర్‌కు సంబంధించిన ఇన్‌కం టాక్స్ రిటర్న్ ఇన్సెంటివ్ డబ్బులు రూ.2.28 లక్షలు బ్యాంకు ఖాతాలో జమకాగా, మొత్తం నగదును తిరుపతి గౌడ్ డ్రా చేసుకున్నాడు. ఈ విషయం రాజశేఖర్ బ్యాంకు అధికారులకు తెలుపగా తమకు ఎలాంటి సంబంధం లేదని సమాధానమిచ్చారు. దీంతో ఆయన జగిత్యాలకు చెందిన న్యాయవాది మెట్ట మహేందర్ ద్వారా జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. ఈ కేసును వినియోగదారుల ఫోరం పరిశీలించి బాధితుడు రాజశేఖర్‌కు రూ. 2.28 లక్షలను 9 శాతం వడ్డీతో చెల్లించాలని, ఖర్చుల కింద రూ. 5వేలు చెల్లించాలని తీర్పుచెప్పారు.

కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం

- రూ.80 వేల విలువైన వస్తువులు చోరీ


పరిశీలిస్తున్న పోలీసులు

జ్యోతినగర్(రామగుండం): ఓ పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కానిస్టేబుల్ రమేశ్ ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని బి–138 క్వార్టర్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం గదికి తాళం వేసి, బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి వెనక తలుపు పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూసి, చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై బి.జీవన్‌లు పరిశీలించారు. క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. బంగారు నగలతోపాటు టీవీ, ఇతర వస్తువులు మొత్తంగా రూ.80 వేల విలువైన సామగ్రి చోరీకి గురయ్యాయని బాధితుడు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధికుక్కల నుంచి రక్షణపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోరుట్లటౌన్: వీధి కుక్కల నుంచి రక్షణ కోసం విద్యార్థులకు మున్సిపల్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వీధికుక్కల నుంచి రక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, మెప్మా సీఓ శివకుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్


మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల: శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు వస్తుందని, నేరం చేస్తే శిక్ష తప్పదని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. పలుకేసుల్లో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులతో, పీపీలతో గురువారం తన కార్యాలయంలో సమావేశం అయ్యారు. కోర్టు కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేయడం, శిక్షలశాతం పెంచడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. ఫోక్సో, హత్య కేసులను ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలని, ప్రతీకేసుల్లో పంచనామా చేసే సమయంలో ప్రత్యక్ష సాక్ష్యుల ఫొటోల వివరాలు సమగ్రంగా ఉండాలని, సైంటిఫిక్ ఆధారాలు ఖచ్చితంగా జతచేయాలన్నారు. గడిచిన 2–3 నెలల్లో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 13 మందికి కోర్టుద్వారా జైలుశిక్షలు కోర్టు ద్వారా విధించడం జరిగింది. ఆయా కేసుల్లో నేరస్తులకు శిక్షపడేలా కృషి చేసిన పీపీలు మల్లికార్జున్, బాలత్రిపుర సుందరి, మురళీ, సీఎంఎస్ ఎస్సై రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్‌ను అభినందించారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ రాజశేఖర్‌రాజు, సీఎంఎస్ ఎస్సై రాజునాయక్, పీపీలు పాల్గొన్నారు.

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్

జగిత్యాలజోన్: జిల్లాలోని ప్రతీపోలీస్‌స్టేషన్ పరిధిలో ఇకనుంచి తప్పనిసరిగ్గా డ్రంక్అండ్‌డ్రైవ్ పరీక్షలు ఉంటాయని ఎస్పీ భాస్కర్ తెలిపారు ఫిబ్రవరిలో మద్యంసేవించి వాహనాలు నడుపుతున్న వారిలో 690మందిని పట్టుకోవడం జరిగిందన్నారు. ఇటీవల మద్యం సేవించి పట్టుబడ్డ 1,454 మందిని కోర్టుకు పంపగా, వారికి జరిమానా విధించడం జరిగిందన్నారు. తాగి వాహనాలు నడుపొద్దని గ్రామాల్లో కళాబృందాల ద్వారా అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి!

- ఆపరేషన్ ఆలస్యమే ప్రాణం తీసిందన్న బంధువులు
- పాపకు హార్ట్‌బీట్ తక్కువుండటమే కారణమంటున్న వైద్యులు
- మూడు రోజుల క్రితమే దవాఖానాలో చేరిన గర్భిణి
- నార్మల్ డెలివరీ కోసం వేచిచూసిన వైనం
- విచారణ జరిపిస్తాం : డీసీహెచ్ శ్రీధర్


చికిత్స పొందుతున్న సుమంగళి


చనిపోయిన శిశువు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన కలువల సుమంగళి అనే గర్భిణి గత నెల 28న స్థానిక ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో చేరింది. గురువారం ఆపరేషన్ చేయగా పాప జన్మించింది. కాసేపటికే హార్ట్‌బీట్ లేకపోవడంతో కుటుంబసభ్యులు వైద్యులకు సమాచారం అందించారు. పిల్లల డాక్టర్ పరిశీలించి, మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో బాధితులతోపాటు వారి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్సై ఉపేందర్‌రావు దవాఖానాకు చేరుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పాప చనిపోయిందని బాధితులు ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీహెచ్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. మూడు రోజులు సాధారణ ప్రసవం కోసం వేచిచూశారని, ముందే ఆపరేషన్ చేసి ఉంటే పాప బతికేదని సుమంగళి సోదరుడు సురేష్ తెలిపాడు. ఆస్పత్రిలో మందులు లేవంటే బయట కొనుగోలు చేశామని పేర్కొన్నాడు. డ్యూటీలో ఉన్న నర్సుల ప్రవర్తన బాగాలేదని, విధులు నిర్వహించే డాక్టర్ స్థానికంగా ఉండకపోవడం, సకాలంలో ప్రసవం చేయకపోవడం వల్లే శిశువు చనిపోయిందని ఆరోపించాడు.

చెప్పినా వారు వినలేదు : వైద్యురాలు

పాప కుటుంబసభ్యుల అంగీకారం మేరకే ప్రసవం చేసినట్లు వైద్యురాలు రమాదేవి తెలిపారు. హార్ట్‌బీట్ తక్కువగా ఉందని కరీంనగర్ లేదంటే పెద్దపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పినప్పటికీ వారు వినలేదన్నారు. బాధితుల నుంచి వివరాలు తీసుకున్నామని డీసీహెచ్ తెలిపారు. కమిటీ వేసి, విచారణ జరిపి, న్యాయం చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- అక్రమ సంబంధమే హత్యకు దారితీసిందని అనుమానం


ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సై లక్ష్మారెడ్డి


రౌడీ షీటర్ కొమిరే వాసు(ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ గ్రామపంచాయతీ పరిధిలో రౌడీషీటర్ కొమిరె వాసు(40) దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. స్థానిక ఇందిరమ్మకాలనీకి చెందిన కొమిరె వాసు ఒక హత్యతోపాటు పలు కేసుల్లో నిందితుడుగా ఉండడంతో రౌడీషీట్ తెరిచారు. వాసుకు పలువురు మహిళలతో అక్రమ సంబంధాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఓ ఫంక్షన్‌కు వెళ్తున్నానని చెప్పి బయటకెళ్లిన వాసు తిరిగి ఇంటికి రాలేదు. గ్రామంలోని సారంపల్లి శివారు పెద్దమ్మ ఆలయం సమీపంలోని కొమురయ్యకుంట వద్ద చనిపోయి ఉన్నాడని సమాచారం అందింది. కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించి, వాసు హత్యకు గురయ్యాడని గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో సిరిసిల్లరూరల్ సీఐ బి.ఉపేందర్, తంగళ్లపల్లి ఎస్సై పి.లక్ష్మారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని హత్యగా నిర్ధారించి దర్యాప్తు ప్రారంభించారు. వేరే చోట హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించేందుకు శవాన్ని గ్రామశివారుకు తరలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని బైక్‌పై తరలిస్తున్న క్రమంలో రెండు కాళ్లు రోడ్డుకు రాసుకుని గాయాలైనట్లు చర్చించుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఒక మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న క్రమంలో సదరు మహిళ చిన్నకూతురిపై వాసు కన్నేయడంతోనే ఆమె వాసును హత్య చేయించినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. గతంలో సదరు మహిళ పెద్ద కూతురిపై అసభ్యంగా ప్రవర్తించిన విషయం ఠాణా వరకు వెళ్లింది. మృతుడికి భార్య నిర్మల, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తన భర్త హత్యకు గ్రామంలోని ఓ మహిళపై అనుమానం వ్యక్తం చేస్తూ కొమిరె నిర్మల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామని సిరిసిల్లరూరల్ సీఐ బి.ఉపేందర్ తెలిపారు. కాగా ఇప్పటికే హత్యకు కారణమైన మహిళతోపాటు పలువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. వారిని శుక్రవారం లేదా శనివారం అరెస్టు చూపనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

యువతి ఆత్మహత్య


చైతన్య (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన కామిడి చైతన్య(23) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చైతన్య కొంత కాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. ఆస్పత్రుల్లో చూపించి, మందులు వాడుతున్నా నయం కాలేదు. ఈ క్రమంలో గురువారం కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తండ్రి లక్ష్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కటికెవాడకు చెందిన గోగికార్ గణేశ్ గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్ మటన్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నా నిరాకరించడం, ఇటీవల తండ్రి మృతిచెందగా అప్పులు కూడా పెరిగాయి. ఈ క్రమంలో ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ కిశోర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలప పట్టివేత


పట్టుబడ్డ టేకు దుంగలు

చందుర్తి (వేములవాడ): చందుర్తి మండల కేంద్రం శివారులోని అటవీప్రాంతంలో నిల్వ ఉన్న అక్రమ కలపను అటవీ అధికారులు గురువారం పట్టుకున్నారు. చందుర్తి శివారు అటవీ ప్రాంతంలోని గండి మైసమ్మ ఆలయ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు కలపను భద్రపరిచారన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆ ప్రాంతంలో గాలించారు. ఈక్రమంలో రూ.30వేల విలువ చేసే పది టేకు దుంగలు దొరికాయి. వారం రోజులుగా చందుర్తి అటవీ ప్రాంతంలో కలప స్మగ్లర్‌లు విలువైన టేకు చెట్లను నరికి వేసి సొమ్ము చేసుకుంటున్నట్లు చర్చ సాగుతోంది. ఫారెస్టు అధికారులు నిరంతరం నిఘాను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.